క్లుప్తంగా

నేడు శ్రీరామనవమి వేడుకలు



విక్టోరియాపేటలో ప్రత్యేక అలంకరణ సీతారామ లక్ష్మణ ఆంజనేయస్వామి

ఆదోని అర్బన్: పట్టణంలోని విక్టోరియాపేటలో వెలిసిన శ్రీ కోదండరామ ఆలయంలో బుధవారం శ్రీరామనవమి వేడుకలు నిర్వహిస్తామని నిర్వాహకుడు రఘుప్రేమ మంగళవారం తెలిపారు. వేకువజాము నుంచి సీతా రామ లక్ష్మణ ఆంజనేయస్వామి స్వామి వారికి క్షీరాభిషేకం, ఫల పంచామృతాభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. ఉదయం 10 గంటలకు సీతారామ కల్యాణోత్సవం, పల్లకీసేవ, రథోత్సవం ఉంటుందన్నారు. గురువారం చక్రస్నానం చేపడగామని చెప్పారు. అలాగే..పట్టణ శివారులోని మంగరాయ ఆంజనేయస్వామి సన్నిధిలో బుధవారం శ్రీరామనవమి సందర్భంగా 12 గంటలకు సీతారామ కల్యాణోత్సవం జరిపిస్తామని ఆలయ మేనేజర్ వాసుదేవరావు తెలిపారు.

గ్యాస్‌తో అప్రమత్తంగా ఉండాలి



మంటలు ఆర్పే విధానాన్ని చూపుతున్న అగ్నిమాపక అధికారి

ఆదోని అర్బన్: గ్యాస్‌పై వంటలు చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఆదోని అగ్నిమాపక కేంద్రం ఇన్‌చార్జ్, సహాయ జిల్లాధికారి రామాంజనేయులు సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక శిల్పా అపార్ట్‌మెంట్ వాసులకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. మహిళలు వంట చేసేటప్పుడు గ్యాస్ లీకై మంటలు చెలరేగినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, మంటలు ఆర్పే విధానాన్ని ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. సిబ్బంది వెంకటేశ్వర్లు, మల్లికార్జునరెడ్డి, సందీప్‌కుమార్, చాంద్‌బాషా, హనీఫ్, రఘు పాల్గొన్నారు.

ఖైదీల సందర్శన వేళల మార్పు



నజీర్‌అహ్మద్, సబ్‌జైలు సూపరింటెండెంట్

ఆదోని రూరల్: ఎండలు ముదురుతున్న నేపథ్యంలో ఉన్నతాధికారులు (డైరెక్టర్ జనరల్ రీజెన్సీ ఏపీ) ఆదేశాల మేరకు ప్రతిరోజూ ఉదయం 9 నుంచి 11 గంటల వరకు మాత్రమే ఖైదీలను సందర్శించేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు ఆదోని సబ్‌జైలు సూపరింటెండెంట్ నజీర్ అహ్మద్ తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ సబ్‌జైలులో ఉండే ఖైదీలకు అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. గతంలో ఖైదీలను కలవడానికి వచ్చే వారు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, సాయంత్రం 3 నుంచి 4:30 గంటల వరకు అనుమతించే వారమన్నారు. ఇందులో ఒక ముద్దాయికి అరగంట మాత్రమే మాట్లాడే అనుమతి ఉంటుందన్నారు. ప్రస్తుతం సమయ వేళలను కుదించారన్నారు. అలాగే జైలులో మట్టి కుండల్లో చల్లని నీరు, మజ్జిగ ఏర్పాటు చేశామని చెప్పారు.

21న ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రవేశ పరీక్ష

గోనెగండ్ల: ఈనెల 21న ఏపీ మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష ఉంటుందని ప్రిన్సిపల్ షాహినా పర్వీన్ తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు హాల్ టికెట్లను htt pr://cre.ap.gov.in లేదా htt pr://apmr.a pcfrr.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

● మద్దికెర: స్థానిక ఆదర్శపాఠశాలలో 6వ తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈనెల 21వ తేదీ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష ఉంటుందని ప్రిన్సిపాల్ సవిత మంగళవారం తెలిపారు. విద్యార్థులు apmr.apcfrr.in వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకొని, సకాలంలో పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

తొలిసారిగా స్కోరింగ్ బెలూన్ యాంజియోప్లాస్టీ

కర్నూలు(హాస్పిటల్): కర్నూలులోని ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో తొలిసారి ఓ రోగికి స్కోరింగ్ బెలూన్ యాంజియోప్లాస్టీ నిర్వహించినట్లు ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్టు డాక్టర్ నాగేంద్రప్రసాద్ తోట తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. 'జిల్లాలోని కొండాపురం గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగి ఓంకారం సత్యనారాయణరాజు దీర్ఘకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. వారానికి మూడుసార్లు డయాలసిస్ చేయించుకోవాల్సి ఉంది. ఆయన గుండె కండరాలకు తగినంత ఆక్సిజన్‌తో కూడిన రక్తసరఫరా కాకపోవడంతో ఆయాసంతో ఇబ్బంది పడుతున్నాడు. ఈ నేపథ్యంలో సత్యనారాయణరాజుకు తొలుత డయాలసిస్ చేసి.. ఆ తర్వాత స్కోరింగ్ బెలూన్ యాంజియోప్లాస్టీ ఆపరేషన్ విజయవంతంగా చేసి గుండె కండరాలకు రక్తసరఫరా పూర్తిగా పునరుద్ధరించి'నట్లు డాక్టర్ వెల్లడించారు.

ఆధారాలు లేకుంటే చిక్కులే..

● ఎన్నికల వేళ ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాల్సిందే
● సంబంధిత పత్రాలు లేకుండా నగదు, సామగ్రి పట్టబడితే సీజ్
● విడుదలపై జిల్లాస్థాయి త్రిసభ్య కమిటీ పర్యవేక్షణ
● ఎన్నికల కోడ్ అమలైనప్పటి నుంచి రెండు బంగారం బిస్కెట్లు, రూ.37 లక్షల నగదు సీజ్



ఆదోనిలో పట్టుబడిన రూ.37 లక్షలు నగదును చూపుతున్న డీఎస్పీ శివనారాయణస్వామి (ఫైల్)

ఆదోని అర్బన్: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సరైన ధ్రువ పత్రాలు లేకుండా నగదు, విలువైన ఆభరణాలు, సామగ్రి తరలించరాదని ఎన్నికల అధికారులు, పోలీసులు సూచిస్తున్నారు. అయినా కొందరు అవగాహన లేకపోవడం, నిర్లక్ష్యం కారణంగా నగదుతో పట్టుబడుతున్నారు.

ఎన్నికల ప్రవర్తనా నియమావళి గత నెల 16న అమలులోకి వచ్చింది. జిల్లావ్యాప్తంగా 12 తనిఖీ బృందాలు ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నాయి. ఈ సందర్భంగా భారీగానే నగదు, మద్యం స్వాధీనం చేసుకుంటున్నారు. కేవలం చెక్‌పోస్టుల వద్ద వాహనాలు గాకుండా అవసరమైతే ఇళ్లు, హోటళ్లు వంటి వాటిల్లో సైతం తనిఖీలు చేసే అధికారం ఈ బృందాలకు ఉంటుంది. ఇటువంటి పరిస్థితుల్లో ప్రతిఒక్కరూ తమ అవసరాలకు భారీగా నగదు, బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, ఇతర సామగ్రి తీసుకెళ్లాలనుకుంటే తగిన ఆధారాలు వెంట ఉంచుకోవాలి. ఆధారాలు అడిగినప్పుడు చూపించాల్సి ఉంటుంది. ఎటువంటి లెక్కా పత్రం లేకుండా పట్టుబడితే మాత్రం ఆ నగదు, సామగ్రిని అధికారులు తక్షణమే స్వాధీనం చేసుకుంటారు. తద్వారా దాని విడుదల కోసం నానా తంటాలు పడాల్సి ఉంటుంది. ఈ విషయంలో ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు పదే పదే సూచిస్తున్నారు.

రూ.50 వేల నుంచి రూ.10 లక్షల లోపు ఉంటే..

రూ.50 వేల నుంచి రూ.10 లక్షలు లోపు నగదు ఉంటే ఆధారాలు సక్రమంగా ఉన్నాయని భావించినప్పటికీ, పట్టుబడిన నగదు, సామగ్రిని వదిలి వేయడంపై క్షేత్రస్థాయి అధికారులే నిర్ణయం తీసుకోవడం కుదరని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. ఎన్నికల కమిషన్ ప్రత్యేకంగా జిల్లాస్థాయి త్రిసభ్య కమిటీని నియమించింది. క్షేత్రస్థాయి తనిఖీ బృందాలు రూ.50 వేల నుంచి రూ.10 లక్షల లోపు పట్టుకున్న డబ్బుకు, ఆధారాలు సక్రమంగానే ఉన్నా వాటిని వదిలేయకుండా ఈ విషయాన్ని జిల్లాస్థాయి త్రిసభ్య కమిటీకి అప్పగిస్తారు. విడుదల, జప్తు వంటి అంశాలపై ఆ కమిటీ ఎన్నికల నిబంధనల మేరకు నిర్ణయం తీసుకుంటుంది.

ఇబ్బదులు పడొద్దు

పట్టణంలో చిన్న, పెద్ద వ్యాపారులు, రైతులు, సామాన్య ప్రజలు పెద్ద మొత్తం తీసుకెళ్లేటప్పుడు ఆధారాలు వద్ద ఉంచుకోండి. ఎన్నికల కోడ్ ఉన్నందున తనిఖీలో పట్టుబడి ఆధారాలు లేకపోతే సొమ్ము సీజ్ అవుతుంది. చెక్కులు, బ్యాంకు ఖాతాల్లో ట్రాన్స్‌ఫర్ చేసుకోవడం ఉత్తమం. లేదా డీడీ రూపంలోనైనా తీసుకోండి. పెద్ద మొత్తంలో పట్టుబడితే ఇన్‌కమ్ ట్యాక్స్ శాఖకు అప్పగిస్తాం. రూ.50 వేల నుంచి రూ.10 లక్షల లోపు పట్టుబడితే కలెక్టర్ కార్యాలయంలోని జిల్లాస్థాయి త్రిసభ్య కమిటీకి స్వాధీనపరుస్తాం. వారు విచారణ చేసి సరైన ఆధారాలు ఉంటే ఆ సొమ్మును విడుదల చేసే అవకాశం ఉంటుంది.

– శివనారాయణస్వామి, ఆదోని డీఎస్పీ

రూ.50 వేల లోపు ఉంటే..

ఎన్నికల నిబంధనల ప్రకారం కోడ్ ఉన్నందున రూ.50 వేల లోపు ఉన్నా నగదు తనిఖీల్లో పట్టుబడితే సరైన ఆధారాలు ఉన్నట్లయితే పోలీసులు, రిటర్నింగ్ అధికారులు పరిశీలించి వదిలేయవచ్చు.

రూ.10 లక్షలు దాటితే..

ఆధారాలు ఉన్నా, లేకున్నా రూ.10 లక్షల కంటే ఎక్కువ సొమ్ము తరలిస్తూ అధికారులకు పట్టుబడితే తప్పనిసరిగా ఆదాయపన్ను శాఖకు అప్పగిస్తారు. ఆధారాలు చూపించినా ఆదాయశాఖ పన్ను శాఖ అధికారులకు నిర్ణయాధికారం ఉంటుంది.

➤ గత నెల 27వ తేదీన ఓ బంగారుషాపు నిర్వాహకుడు రెండు బంగారు బిస్కెట్‌లను ఆదోని నుంచి తరలిస్తుండగా స్థానిక రైల్వేస్టేషన్‌లో రైల్వే పోలీసులు, ఎస్ఐ గోపాల్ బృందంతో పట్టుకున్నారు. ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో రెండు బంగారు బిస్కెట్‌లను స్వాధీనం చేసుకుని సీజ్ చేసి, ఆదాయ పన్నుశాఖకు అందజేశారు. దీని విలువ రూ.41.31 లక్షలుగా ఉంది.

➤ ఈనెల 10వ తేదీన ఓ బంగారు షాపు గుమస్తా రూ.37 లక్షల నగదును ఆదోని నుంచి తరలిస్తుండగా స్థానిక రైల్వేస్టేషన్ ముందు టూటౌన్ సీఐ గోపీ, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందంతో కలిసి స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఆధారాలపై ఆరా తీయగా సరైన సమాధానం రాకపోవడంతో ఆ నగదును ఆదాయ పన్ను శాఖకు అప్పగించారు.

జగన్‌తోనే పేదల సంక్షేమం



కోసిగిలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ మురళీ మోహన్ రెడ్డి

కోసిగి: వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే పేదల సంక్షేమం సాధ్యమని వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీ మోహన్ రెడ్డి అన్నారు. మంగళవారం కోసిగి మండలం సజ్జలగుడ్డం, దేవర బెట్ట, జంపాపురం గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేశారు. నవరత్నాల పథకాలతో అన్ని వర్గాలకు మేలు చేశారని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేశారన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే సీఎంగా జగనన్నను గెలిపించుకోవాలని కోరారు. టీడీపీ అబద్ధపు హామీలను నమ్మి మోసపోవద్దన్నారు. దేవరగట్టు గ్రామ రైతులకు కోసం ఎమ్మెల్యే లిఫ్ట్ ఇరిగేషన్ మంజూరు చేయించారని గుర్తు చేశారు. ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఎంపీపీ ఈరన్న, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బెట్టనగౌడ, నాయకులు శ్రీనివాసరెడ్డి, నాడుగేని నాగరాజు, మంగమ్మ, జగదీష్ స్వామి, బుళ్లి నరసింహులు, బండ్ల గోవిందు, గానిగ వీరస్వామి ప్రతాప్, బసిరెడ్డి, దొడ్డి నరసన్న, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

అతను మా పార్టీ నేత కాదు



మాట్లాడుతున్న ఎంపీపీ అమరేష్

కౌతాళం: ఇండిపెండెంట్‌గా గెలుపొంది టీడీపీలో చేరిన ఉరుకుంద ఎంపీటీసీ సభ్యుడిని వైఎస్సార్‌సీపీ నేత అని అనడం మంచిది కాదని ఎంపీపీ అమరేష్ అన్నారు. మంగళవారం అగసలదిన్నె గ్రామంలో వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, పార్టీ మండల కన్వీనర్ ప్రహ్లాదాచారితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలు.. అభివృద్ధి కార్యక్రమాలతో ఇతర పార్టీల నుంచి అనేక మంది వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారని తెలిపారు. తమ పార్టీ నుంచి ఎవరూ వెళ్లడం లేదని స్పష్టం చేశారు. ఉరుకుంద ఎంపీటీసీ సభ్యుడు ఇండిపెండెంట్‌గా గెలుపొందాడని..ఆయన తెలుగుదేశం టీడీపీలో చేరితే వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ అనడం సరికాదన్నారు. ఎవరు ఏ పార్టీలోకి వెళ్లినా తమ పార్టీకి వచ్చే నష్టం ఏమీలేదన్నారు. మరోసారి వైఎస్సార్‌సీపీ భారీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కోఆప్షన్ మెంబర్ మహబుబ్‌సాబ్, నాయకులు ఉరుకుంద అయ్యప్ప, నాగభూషణ్‌గౌడ్, అబ్దుల్‌సమద్, మరేగౌడ్, తిక్కయ్య, లింగాలదిన్నెగౌడ్ పాల్గొన్నారు.

ఎమ్మిగనూరులో బాలయ్య ఫ్లాప్ 'షో'

● మొరాయించిన మైక్‌సెట్
● నిరాశ చెందిన అభిమానులు

ఎమ్మిగనూరు: సినీ హీరో నందమూరి బాలకృష్ణ ఎమ్మిగనూరు పర్యటన ఫ్లాప్ షోగా మారింది. స్వర్ణాంధ్ర యాత్ర పేరుతో హిందూపురం ఎమ్మెల్యే, హీరో బాలకృష్ణ మంగళవారం సాయంత్రం 5.45గంటలకు ఎమ్మిగనూరుకు చేరుకొన్నారు. శివ సర్కిల్‌లో అభిమానులనుద్దేశించి బాలకృష్ణ ప్రసంగం మొదలు పెట్టగానే టీడీపీ నేతలు ఏర్పాటు చేసిన మైక్ సెట్ మొరాయించింది. దీంతో బాలకృష్ణ ప్రసంగం ఎవరికీ అర్థంకాక అభిమానులు, కార్యకర్తలు వెనుదిరిగారు. ఏర్పాట్లలో లోపాలతో విసుగుచెందిన బాలకృష్ణ తన ప్రసంగాన్ని మధ్యలోనే ముగించి ఆదోని రోడ్డు, ఓంశాంతి సర్కిల్ మీదుగా మంత్రాలయం నియోజకవర్గంలోకి వెళ్లారు. రూట్ మ్యాప్‌లో ఆర్టీసీ బస్టాండ్ మీదుగా పోలీస్ స్టేషన్, శివ సర్కిల్, కూరగాయల మార్కెట్, ట్యాంక్ బండ్ రోడ్డు, శ్రీనివాస సర్కిల్, మార్కెట్ యార్డు సర్కిల్ మీదుగా బాలకృష్ణ రోడ్డు 'షో' ఉంది. ఏర్పాట్లలో లోపాలు, తన ప్రసంగం మొదలవ్వగానే ప్రజలు వెనుదిరగటంతో బాలకృష్ణ రూట్ మ్యాప్‌లో రోడ్ షో చేయకుండా మంత్రాలయం వెళ్లిపోయారు. ఆయా సర్కిళ్లలో బాలకృష్ణ కోసం వేచి ఉన్న అభిమానులు నిరాశతో వెనుదిరిగారు. తెలుగుదేశం పార్టీ అభ్యర్థి జయనాగేశ్వరరెడ్డి ఏర్పాట్లు సక్రమంగా చేయకపోవటంతోనే బాలయ్య ఆగ్రహంతో రోడ్ షో రద్దు చేసుకొని వెళ్లాడంటూ ఆపార్టీ నేతలు గుసగుసలాడారు. బాలకృష్ణ షోతో ఓట్ల లబ్ధిపొందాలనుకున్న టీడీపీ నేతల ఆశలు అడియాసలయ్యాయి. మొత్తం మీద ఎమ్మిగనూరులో బాలయ్య రోడ్డు షో 'ఫ్లాప్ షో' అయ్యింది.

ఓటర్లలో నమ్మకం పెంచడానికే మార్చ్

తుగ్గలి: ఎన్నికల సందర్భంగా ఓటర్లలో నమ్మకాన్ని కలిగించడంతో పాటు ప్రశాంతంగా ఎన్నికల నిర్వహించడం కోసం కేంద్రబలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు తుగ్గలి ఎస్ మల్లికార్జున తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని రామకొండ, రాంపల్లి, పెండేకల్లు రైల్వే జంక్షన్, ఎద్దులదొడ్డి, తుగ్గలిలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ ఎన్నికల్లో ఓటర్లలో నమ్మకాన్ని పెంచడానికి ఇలాంటి ఫ్లాగ్‌మార్చ్‌లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ప్రశాంతంగా ఎన్నికలు జరిగే విధంగా చూడటం పోలీసుల బాధ్యత అన్నారు. ప్రశాంత ఎన్నికలకు సహకరించాలన్నారు.

వలంటీర్ల రాజీనామా

ఆదోని టౌన్: పట్టణంలోని 21వ వార్డులో సి.పద్మ, 22వ వార్డులో కె.మహాదేవి, 23వ వార్డులో ఎం.గౌసియాభాను, 28వ వార్డులో జి.ఎం.వీరేష్, కె.హారిక, హెచ్.ఎం.శివ, జి.అర్జున్ మంగళవారం రాజీనామా చేసి సచివాలయం అడ్మిన్‌లకు అందజేశారు. ఆ ప్రతులను అడ్మిన్‌లు ఆమోదం కోసం మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డికి సిఫారసు చేశారు. రాజీనామాల ఆమోదం కోసం ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశామని ఆయన తెలిపారు.

ఏడుగురు వలంటీర్ల రాజీనామా

కౌతాళం: వలంటీర్ల రాజీనామాల పర్వం కొనసాగుతోంది. మంగళవారం కౌతాళం మండల పరిధిలోని సుళేకేరి గ్రామానికి చెందిన ఏడుగురు వలంటీర్లు రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను ఎంపీడీఓ రఘునాథ్‌గుప్తాకు అందజేశారు. ఆమోదం కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని ఆయన తెలిపారు.

మంత్రాలయంలో 50 మంది వలంటీర్ల రాజీనామా

మంత్రాలయం: ముఖ్యమంత్రిగా వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలన్న తాపత్రయంతో వలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామాలు చేస్తున్నారు. మంగళవారం మంత్రాలయం మండలంలో 50 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ మునెప్పకు రాజీనామా పత్రాలు సమర్పించారు. మంత్రాలయం మండల కేంద్రంలో 10, చిలకలడోణలో 18, వగరూరులో 22 మంది రాజీనామా చేశారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగనన్న మరోమారు సీఎం కావాలని వారు ఆకాంక్షించారు.



ఎంపీడీఓకు రాజీనామా పత్రాలను సమర్పిస్తున్న వలంటీర్లు



ఎంపీడీఓకు రాజీనామాలు సమర్పిస్తున్న చిలకలదోణ వలంటీర్లు



రాజీనామా పత్రాలను చూపుతున్న వలంటీర్లు

వలంటీర్లుగా నియమించి తమకు సమాజంలో ఎంతో గౌరవం తెచ్చారని ఆనందం వ్యక్తం చేశారు.

ఆదోని రూరల్: మండలంలోని దొడ్డనగేరి నుంచి ఐదుగురు, చిన్నహరివాణం నుంచి 11 మంది వలంటీర్లు మంగళవారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను ఇన్‌చార్జి ఎంపీడీఓ విజయశేఖర్ రావుకు అందజేశారు. వాటిని ఉన్నతాధికారులకు పంపుతున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.

21న ఏపీ మోడల్‌లో ప్రవేశ పరీక్ష

కోసిగి: మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో ఈనెల 21వ తేదీ 6వ తరగతి ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సమీరారెడ్డి తెలిపారు. పాఠశాలలో 6వ తరగతిలో 100 సీట్లు ఉన్నట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో 195 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఈనెల 21వ తేదీ ఉదయం 10 నుంచి 12గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నామని చెప్పారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో హాల్ టికెట్స్ డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. విద్యార్థులు ఉదయం 8.30 గంటల్లోగా పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. పరీక్షలో వచ్చే మార్కుల ఆధారంగా సీట్లు కేటాయిస్తామని పేర్కొన్నారు.

నేడు సీతారాముల కల్యాణోత్సవం

కోసిగి: స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని రామాలయం, రంగప్పగట్టు, పెండేకల్లు ఆలయాల్లో బుధవారం శ్రీరామనవమి వేడుకలు నిర్వహించనున్నారు. ఆలయాలను వివిధ రకాల పుష్పాలు, విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. స్వామివారి కల్యాణాన్ని నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు.

బాలయ్య పర్యటనకు స్పందన కరువు

మంత్రాలయం: సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా నటుడు, టీడీపీ నేత బాలకృష్ణ మంత్రాలయం నియోజకవర్గంలో పర్యటించారు. యాత్రలో భాగంగా మంగళవారం రాత్రి మంత్రాలయం మీదుగా కోసిగి చేరుకుని ప్రసంగించారు. అయితే సాయంత్రం 5 గంటలకు ప్రారంభం కావాల్సిన ప్రసంగం రాత్రి 8.15 గంటలకు ప్రారంభమైంది. సుమారు మూడు గంటలు ఆలస్యం కావడంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు బేజారుకు గురయ్యారు. అంతే కాక ఆయన ప్రసంగం అర్థం కాక ప్రతి ఒక్కరూ తలలు పట్టుకున్నారు. ఊహించిన రీతిలో ఆదరణ లేకపోవడంతో పార్టీ శ్రేణుల్లోని అసంతృప్తి వ్యక్తమైంది. ఆయనతో పాటు జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, ఎంపీ అభ్యర్థి నాగరాజు, ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి ఉన్నారు.

అభివృద్ధి చేశాం.. ఆశీర్వదించండి



ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరుతున్న ఎంపీపీ అమరేష్



ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహిస్తున్న గిరిజమ్మ

కౌతాళం: ప్రతి ఇంటికి సంక్షేమాలు అందించి గ్రామాలను అభివృద్ధి చేశాం.. మరోసారి వైఎస్సార్‌సీపీ ఆశీర్వదించాలని ఎంపీపీ అమరేష్, పార్టీ మండల కన్వీనర్ ప్రహ్లాదాచారి, గిరిజమ్మ అన్నారు. మంగళవారం మండలంలోని లింగాలదిన్నె, అగసలదిన్నె, డంబలదిన్నె, బాపురం, వీరాలదిన్నె గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. అనూషరెడ్డి, ప్రియాంకరెడ్డి, కుమారిరెడ్డిలతో కలిసి ఇంటింటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేశారని.. రాష్ట్రాన్ని అభివృద్ధి చేశారని.. అభివృద్ధిని చూసి ఓటు వేయాలని కోరారు. పేదలు సంతోషంగా ఉండాలన్నా.. రాష్ట్రం మరింత అభివృద్ధి సాధించాలన్నా మరోసారి వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, కో ఆప్షన్ మెంబర్ మహబుబ్‌సాబ్, సర్పంచ్‌లు వీరభద్రగౌడ్, పామన్న, శిల్ప, నాయకులు దాట్ల సుబ్బరాజు, రాఘవేంద్రరెడ్డి, వడ్డె రాము, అబ్దుల్ సమద్, భీమేష్, మరేగౌడ్, అనిల్ కుమార్, నాగభూషణ్‌గౌడ్, కుమార్‌గౌడ్, దివాకర్‌రెడ్డి, గురునాథ్‌రెడ్డి, వెంకోబ, వెంకటరామిరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు మూకన్న, జైపాల్ పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకు మద్దతివ్వండి




ముచ్చగిరిలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేత ప్రదీప్‌రెడ్డి

పెద్దకడబూరు: అన్ని వర్గాలకు సంక్షేమ పాలన అందించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ముచ్చగిరి, గవిగట్టు గ్రామాల్లో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలను అందించి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని సంక్షేమం అభివృద్ధి వైపు నడిపిస్తూ ఐదేళ్ల పాటు అద్భుత పాలన అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగనన్నకే దక్కుతుందన్నారు. అలాంటి పాలన కొనసాగాలంటే ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బీవై రామయ్య, వై.బాలనాగిరెడ్డిని గెలిపించాలన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తంరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయ కమిటీ సభ్యుడు విజయేంద్రరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ రవిచంద్రరెడ్డి, సర్పంచ్‌లు హనుమంతు, చంద్రకళ, రామాంజనేయులు, ఇస్మాయిల్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుడిసె శివన్న, మాజీ ఎంపీపీ రఘురాముడు, నాయకులు గజేంద్రరెడ్డి, శివారెడ్డి, నవీన్‌రెడ్డి, ముక్కరన్న, అర్లప్ప, పూజారి ఈరన్న, పెద్దయ్య, వెంకప్పస్వామి తదితరులు పాల్గొన్నారు.

తుస్సుమన్న తిక్కారెడ్డి!

● పార్టీ పదవితో అనుచరుల ఆశలపై నీళ్లు
● ఆలోచనలో పడ్డ అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి



పాలకుర్తి తిక్కారెడ్డి



ఎస్.రాఘవేంద్రరెడ్డి

మంత్రాలయం: అంతన్నాడు.. ఇంతన్నాడు.. అంతలోనే తుస్సుమన్నాడు. టిక్కెట్ సాధించే వస్తా.. టిక్కెట్ లేదంటే ఎదురొడ్డి రెబల్ రేసులో నిలబడతా.. అంటూ భీరాలు పోయాడు. ఆయన సాహసాన్ని చూసి వర్గీయులంతా సంబరపడిపోయారు. టిక్కెట్‌పై ఇన్నాళ్లు నానా హడావుడి చేశాడు. వైఎస్సార్‌సీపీ కోవర్టులన్నాడు.. కాలు దువ్వాడు.. ఆఖరికి కయ్యమన్న వాళ్లతోనే చేతులు కలిపాడు. పార్టీ పదవి రాగానే నమ్ముకున్నోళ్లను నట్టేట్లో నిలబెట్టేశాడు. ఇదీ టీడీపీ నేత పాలకుర్తి తిక్కారెడ్డి తీరు. ఆయన 'తిక్క'మకపై సొంత వర్గీయులే పెదవి విరుస్తున్నారు.

ఖంగుతిన్న తమ్ముళ్లు

టీడీపీ మంత్రాలయం నియజకవర్గ ఇన్‌చార్జ్‌గా పాలకుర్తి తిక్కారెడ్డి 10 ఏళ్లుగా కొనసాగారు. 2014, 2019 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఈసారి టిక్కెట్ తననే వరిస్తుందని ఆశపడి భంగపోయారు. అయినా తిక్కారెడ్డి మనోధైర్యాన్ని మెచ్చుకుని ఆయన కోటరీ అంతా ఆయన వెంటే నిలబడింది. టిక్కెట్ రాకపోయినా రెబల్‌గా నిలుస్తానని అనుచరులకు మాట కూడా ఇచ్చారు. 10 రోజుల పాటు తన వర్గాలతో సమీక్షలు సైతం చేపట్టారు. అనుచరులు సైతం రెబల్‌గా నిలబడినా సపోర్టు చేస్తామని భరోసా ఇచ్చారు. అంతలోనే పార్టీ జిల్లా అధ్యక్ష పదవి కట్టబెట్టగానే తన హామీని గాలికి వదిలేశాడు. సోమవారం స్థానిక అభ్యర్థి ఎస్.రాఘవేంద్రరెడ్డితో చేతులు కలిపాడు. ఉన్నపాటున తిక్కారెడ్డి వెనకడుగు వేయడంతో తమ్ముళ్లు ఖంగుతిన్నారు.

ఏగేదెట్టాగ..?

పాలకుర్తి తిక్కారెడ్డి అంటేనే దూకుడు. ఆయన దూకుడిని తట్టుకోవడం కాస్త ఇబ్బంది కరమే. నిన్నటి వరకు ఎస్.రాఘవేంద్రరెడ్డిపై నిప్పులు చెరిగారు. వైఎస్సార్‌సీపీ కోవర్టు అంటూ ఆరోపణలు గుప్పించారు. ఇలాంటి వ్యక్తిని నమ్మడం ఎలా.. ఆయన్ను కంట్రోలు చేయడం ఎలా అన్న డైలామాలో ఎస్.రాఘవేంద్రరెడ్డి పడిపోయారు. తిక్కారెడ్డి అనుచరులు, ఎస్.రాఘవేంద్రరెడ్డి అనుచరుల మధ్య ఇప్పటికే వైరం పురుడోసుకుంది. ఒకరిపై ఒకరు దూషణలు చేయడంతో ప్రభావం కింది స్థాయి వర్గాలకు పాకిపోయింది. పార్టీలో సీనియర్లు, జూనియర్ల అనే తేడాలు వచ్చేశాయి. తిక్కారెడ్డి దుందుడుకు ఎక్కడ తనకు నష్టం తెస్తుందోనని అభ్యర్థి ఆందోళనలో పడ్డారు.

సఖ్యత కుదరడం కష్టమే

ఇటు ముఖ్య నాయకులు, అటు గ్రామస్థాయి నాయకులు మధ్య సఖ్యత కుదరడం కష్టమే. ఇప్పటికే ఎస్.రాఘవేంద్రరెడ్డి తన సామాజిక వర్గానికి ప్రాధాన్యత ఇస్తూ గ్రామాల్లో ప్రచారాలకు దిగారు. ఉన్నట్టుండి తిక్కారెడ్డి చేతులు కలపడంతో ఆయా గ్రామాల్లో అనుచరుల మధ్య విబేధాలు నెలకొన్నాయి. వాల్మీకి సామాజికి వర్గానికి ప్రాధాన్యత ఇస్తే మిగతా సామాజిక కులాల నేతలు ఎస్.రాఘవేంద్రరెడ్డి సపోర్టు చేరని తెలిసిపోతోంది. నాయకులు ఒక్కటైనంత మాత్రాన కింది స్థాయి క్యాడెర్ కలిసిపోవాలంటే ఇబ్బందేనని రాజకీయ పరిశీలకులు పేర్కొంటున్నారు. ముసుగు కప్పిన విబేధాల నడుమ ఎలా నెట్టుకొస్తారన్నదే ప్రశ్నార్థకం.

స్థలం తగాదా..ముగ్గురిపై కేసు నమోదు

ఆదోని రూరల్: స్థలం తగాదా విషయంలో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు తాలూకా ఎస్ఐ ఎర్రిస్వామి మంగళవారం తెలిపారు. మండలంలోని కడితోట గ్రామంలో ఉప్పర వీరేంద్ర, వడ్డే నరసప్ప మధ్య ఇంటి స్థలం విషయంలో వివాదం నడుస్తోంది. మూడేళ్ల క్రితం ఇద్దరూ కోర్టుకు వెళ్లారు. ఇటీవల వీరేంద్రకు కోర్టు స్టే ఇవ్వడంతో ఆ స్థలంలో నరసప్ప నిర్మాణాలు చేస్తున్న దృశ్యాన్ని ఫొటో తీయడానికి వెళ్లడంతో ఇద్దరూ గొడవ పడి గాయాలపాలయ్యారు. వీరేంద్ర, తల్లి అంజినమ్మ, మరో వర్గం నరసప్పపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

పోషకాలతోనే ఆరోగ్యం

మద్దికెర: పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడం వల్ల చిన్న పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని ప్రభుత్వ వైద్యాధికారి రాగిణి అన్నారు. మంగళవారం స్థానిక వైద్యశాలలో చిన్న పిల్లల సంరక్షణపై అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ రక్తహీనత, పిల్లలు ఎదగకపోవడం వంటి లక్షణాలు రాకుండా తప్పనిసరిగా గర్భిణులు, బాలింతలు పోషకవిలువలు కలిగిన ఆకుకూరలు, కాయగూరలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ నిరంజన్‌బాబు, హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాషా పాల్గొన్నారు.